జగనన్న గృహ పథకం వివరాలు: మొత్తం లబ్ధిదారులు	మొత్తం లే అవుట్‌లు	నిర్మాణం ప్రారంభమైన ఇళ్లు	నిర్మాణం పూర్తయిన గృహాలు	శ్లాబులు పూర్తయినవి	రూఫ్ స్థాయిలో ఉన్నవి	లింటల్ స్థాయిలో ఉన్నవి	బేస్‌మెంట్ లెవెల్‌లో ఉన్నవి	7 లే అవుట్‌లలో ఫ్లింత్ భీమ్ స్థాయిలో ఉన్నవి	గ్రౌండ్ లెవెల్‌లో ఉన్నవి
27,006	24	19279	528	952	766	112	10234	4203	46

క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో గిరి ప్రదక్షిణ



గిరి ప్రదక్షిణలో పాల్గొన్న భక్తులు

ఉక్కునగరం: మాఘ పౌర్ణమిని పురస్కరించుకుని స్థానిక సెక్టార్–1లోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో గిరి ప్రదక్షిణను గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సాయంత్రం ఆరు గంటలకు ప్రారంభమైన ప్రదక్షిణ ఆద్యంతం గోవింద నామస్మరణతో మార్మోగింది. ఆలయ అర్చకులు భావనారాయణ స్వామి, హరి స్వామి నేతృత్వంలో జరిగిన కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. అంతకు ముందు వేకువజామున వేంకటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు, అర్చనలు చేశారు. అనంతరం భక్తులు తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

స్టీల్‌ప్లాంట్ ఉద్యోగికి తీవ్ర గాయాలు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న శ్రీనివాసరావు

ఉక్కునగరం: వాకింగ్ చేస్తున్న స్టీల్‌ప్లాంట్ ఉద్యోగిని వెనుక నుంచి కారు ఢీకొన్న సంఘటనలో తీవ్రంగా గాయపడ్డారు. ప్రత్యక్షసాక్షుల సమాచారం మేరకు వివరాలివి.. స్టీల్‌ప్లాంట్ రిఫ్రాక్టరీ ఇంజినీరింగ్ విభాగం (ఆర్ఈడీ) విభాగంలో సీనియర్ మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్న ఎల్. శ్రీనివాసరావు కూర్మన్నపాలెంలో తన కుటుంబంతో నివసిస్తున్నారు. శుక్రవారం ఉదయం యథావిధిగా స్టీల్‌ప్లాంట్ రహదారిలో వాకింగ్ చేస్తుండగా, వెనుక నుంచి వస్తున్న కారు ఆయన్ను బలంగా ఢీకొంది. ఈ సంఘటనలో శ్రీనివాసరావు తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే ఆయన్ను ఉక్కు జనరల్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స చేసిన అనంతరం, షీలానగర్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ ఆయన కోలుకుంటున్నట్లు సమాచారం.

హెచ్ఐవీపై కళాజాత



ఎయిడ్స్‌పై అవగాహన కల్పిస్తున్న కళాకారులు

అగనంపూడి: హెచ్ఐవీ/ఎయిడ్స్‌పై కళాజాత ద్వారా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, విశాఖ జిల్లా ఎయిడ్స్ నియంత్రణ మండలి, తేజస్విని కళాజాత సంయుక్తంగా అగనంపూడి కూడలిలో శుక్రవారం అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రాజెక్టు మేనేజర్ పోలినాయుడు, ఢిల్లేశ్వరి మాట్లాడుతూ హెచ్ఐవీ సోకిన తరువాత ఎయిడ్స్‌గా మారేలోగా ముందస్తుగా మందులు వాడడం వల్ల వాటి ప్రభావాన్ని కొద్దిగా తగ్గించేందుకు అవకాశం ఉందన్నారు. హెచ్ఐవీకి కారణాలు, నివారణ మార్గాలపై కళాకారులు పాటల ద్వారా అవగాహన కల్పించారు.

26న ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా

సబ్బవరం:స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 26న జాబ్ మేళా నిర్వహిస్తున్నామని ప్రిన్సిపాల్ బి. శంకర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జవహర్ నాలెడ్జ్ సెంటర్ ఆధ్వర్యంలో జరిగే ఈ జాబ్ మేళాను నిరుద్యోగ యువకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. 27 ఏళ్ల లోపు వయస్సు ఉండి ఎంఎస్సీ కెమిస్ట్రీ, బీఎస్సీ కెమిస్ట్రీ 2020–21,2021–22, 2022 –23 విద్యా సంవత్సరంలో డిగ్రీ ఉత్తీర్ణులైన నిరుద్యోగ యువకులు డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్కిల్ ట్రైనింగ్, గవర్నమెంట్ ఆఫ్ ఏపీ హెటిరో డ్రగ్స్ సంయుక్తంగా ఈ జాబ్ మేళా నిర్వహిస్తున్నారన్నారు. ఆసక్తి కలిగిన యువకులు బయోడేటా, సర్టిఫికెట్స్‌తో 26న కళాశాలకు హాజరు కావాలని సూచించారు.



పేదల సొంతింటి కలను సాకారం చేసి వారికి ఆత్మబంధువు అయ్యారు సీఎం జగన్‌మోహన్ రెడ్డి. చిరకాల స్వప్నం ఫలిస్తున్న వేళ ప్రజలు ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు. జగనన్న కాలనీల నిర్మాణాలు చురుగ్గా జరగడంతో లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



శ్లాబ్ దశకు చేరుకున్న నిర్మాణాలు



పైడివాడ అగ్రహారంలో జగనన్న ఇళ్లు

చిరకాల స్వప్నం నెరవేరుతున్న తరుణం

- పేదల సొంతింటి కలను సాకారం చేసిన సీఎం జగన్
- చకచకా నిర్మితమవుతున్న జగనన్న కాలనీలు
- లబ్ధిదారుల హర్షాతిరేకాలు

టిడ్కో గృహాల వివరాలు	
మొత్తం లే అవుట్‌లు	12
మొత్తం గృహాలు	9520
లబ్ధిదారులకు అప్పగించిన గృహాలు	1064

గాజువాక : పేదలకు రాష్ట్ర ప్రభుత్వం సమాజంలో గౌరవ స్థానాన్ని కల్పిస్తోంది. ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న గృహ నిర్మాణ పథకం, టిడ్కో గృహాలతో పేదల సొంతింటి కల సాకారం అవుతోందిప్రతిపక్ష నేతగా చేసిన పాదయాత్రలో ఇళ్లు కట్టుకోవడానికి కష్టాలు పడుతున్న పేదలను చూసి చలించిపోయిన జగన్ మోహన్‌రెడ్డి.. ఎలాంటి ఇబ్బందులు పడకుండా వారికి సొంతిళ్లు కట్టించాలనే దృఢ సంకల్పం తీసుకున్నారు. అందులో భాగంగా జగనన్న కాలనీల పేరుతో లక్షల ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఎంతోమంది పేదలను సొంత ఇళ్లకు యజమానులను చేసి వారి కళ్లల్లో ఆనందాన్ని నింపారు.

జగనన్న గృహ నిర్మాణ పథకం కింద గాజువాక నియోజకవర్గంలో ఇప్పటివరకు 27,006 మంది లబ్ధిదారులను ఎంపిక చేసిన అధికారులు వారికి ఒక సెంటు చొప్పున స్థలాలను పంపిణీ చేయగా, మరో 9520 మందికి టిడ్కో గృహాలను అందజేస్తున్నారు. ఇప్పటికే రెండు లే అవుట్‌లలో 1064 మంది లబ్ధిదారులకు టిడ్కో ఇళ్లను కూడా అప్పగించారు. జగనన్న గృహ పథకాన్ని లబ్ధిదారులకు 24 లే అవుట్‌లలో ఒక సెంటు చొప్పున స్థలాలను మంజూరు చేసిన ప్రభుత్వం, టిడ్కో గృహాల లబ్ధిదారులకు 12 లే అవుట్‌లలో గృహాలను సిద్ధం చేస్తోంది. ఇప్పటికే రెండు లే అవుట్‌లలో ఇళ్లను అప్పగించిన అధికారులు తాజాగా మరో ఏడు లే అవుట్‌లలో ఇళ్లను సిద్ధం చేస్తున్నారు.

సొంతిల్లు కలగా మిగిలిపోతుందనుకున్నా..



నేను బతుకుతెరువు కోసం అనకాపల్లి నుంచి ఇక్కడికి వచ్చి జీవిస్తున్నాను. నా భర్త ఆటోనగర్‌లో లేబర్ పని చేస్తున్నారు. ఆయన కష్టం పైనే మా కుటుంబం గడవాలి. వచ్చే కూలి డబ్బుల్లో సగం అద్దెకు పోవడంతో జీవనమే కష్టంగా సాగుతుంటే ఇక సొంత ఇల్లు కలే అనుకున్నాను. ఆ తరుణంలో జగనన్న దయ వల్ల ఇప్పుడు నాకు సొంత ఇల్లు మంజూరైంది. సెంటు స్థలం ఇచ్చారు. అందులో ఇల్లు కట్టుకుంటున్నాం. ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు .

– భీశెట్టి లక్ష్మి, టీపీఎస్ కాలనీ

ఇది జగనన్న దయే..



విజయనగరం నుంచి పొట్టకూటి కోసం గాజువాక వచ్చాం. ఏదో ఒక పని చేసుకుని బతకవచ్చనే ఉద్దేశంతో వచ్చేశాం. కూలి పనులు చేసుకుంటూ జీవిస్తున్నాం. సంవత్సరాల తరబడి ఇక్కడ అద్దె ఇంట్లో ఉంటున్నాం. మేము సంపాదించే కొద్దిపాటి కూలి డబ్బులతో అటు అద్దె కట్టుకుంటూ ఇటు పోషణకు ఉపయోగించుకోవడం చాలా కష్టంగా ఉంటోంది. అద్దె భారం తగ్గుతుందని ఎక్కడైనా చిన్న స్థలం సంపాదించుకుందామని ఏళ్ల తరబడి ప్రభుత్వ కార్యాలయానికి దరఖాస్తులు ఇచ్చాం. చివరికి జగనన్న ముఖ్యమంత్రి అయిన తరువాత ఆ కోరిక నెరవేరింది. మంచి లే అవుట్‌లో మాకు సెంటు స్థలం ఇచ్చారు. జగనన్న దయతో సొంతిల్లు రావడం చాలా సంతోషంగా ఉంది.

– కంభపు అప్పయ్యమ్మ, గాజువాక

ఐక్య పోరాటాలతో 'ఉక్కు' పరిరక్షణ



1107వ రోజు దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ నిర్ణయానికి వ్యతిరేకంగా ఉద్యోగులు, కార్మికులు, మేధావులు, విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొని ఉక్కు ఉద్యమాన్ని ప్రజా ఉద్యమంగా మలచాలని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు కోరారు. స్టీల్‌ప్లాంట్ పరిరక్షణే ధ్యేయంగా పోరాడుతున్న కార్మికులకు అందరూ అండగా నిలవాలని కోరారు. ఉక్కు పరిరక్షణ కోసం కూర్మన్నపాలెం కూడలి వద్ద జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు శుక్రవారం నాటికి 1107వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో సంస్థకు చెందిన పలు విభాగాల కార్మికులు పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం విశాఖ ఉక్కును అమ్మాలని ప్రకటించడం కార్మికుల జీవితాలతో ఆడుకోవడమే అన్నారు. ఇన్ని రోజులుగా కార్మికులు విశాఖ ఉక్కును గురించి పోరాడుతున్నా, ప్రధాని నరేంద్రమోదీ స్టీల్‌ప్లాంట్ విషయం ప్రస్తావించకపోవడం దుర్మార్గమన్నారు. ప్రత్యక్షంగా, పరోక్షంగా లక్షల మందికి ఉపాధిని కల్పిస్తున్న విశాఖ ఉక్కును నష్టాల పేరుతో ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టడం అన్యాయమన్నారు. స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వరంగ సంస్థగానే కొనసాగించేలా కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

'స్టీల్‌ప్లాంట్ అంశంపై రాజకీయ పార్టీలు ఒత్తిడి తేవాలి'

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా రాజకీయ పార్టీలు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు కోరారు. శుక్రవారం జరిగిన పోరాట కమిటీ సమావేశంలో మార్చి 1న ప్రధాని నరేంద్ర మోదీ విశాఖ పర్యటన నేపథ్యంలో చేపట్టాల్సిన కార్యక్రమాల గురించి చర్చించారు. రాష్ట్రంలోని రాజకీయ పార్టీల నాయకులు స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలో కొనసాగించడం, సెయిల్‌లో విలీనం చేస్తామని ప్రకటించేలా ప్రధానిపై ఒత్తిడి తేవాలన్నారు. ఇందులో భాగంగా ఈ నెల 25న ఉక్కు నిర్వాసిత కాలనీల్లో పాదయాత్ర నిర్వహించనున్నారు. 27న కూర్మన్నపాలెం నిరాహార దీక్ష శిబిరం నుంచి నగరంలోని జీవీఎంసీ శిబిరం వరకు పాదయాత్ర చేయనున్నారు. జె.అయోధ్యరామ్ అధ్యక్షత వహించిన కార్యక్రమంలో డి.ఆదినారాయణ, కె.ఎస్.ఎన్.రావు, నీరుకొండ రామచంద్రరావు, రామ్మోహన్ కుమార్, గణపతిరెడ్డి, డి.వి.రమణ, బొడ్డు పైడిరాజు, వి. శ్రీనివాసరావు, మహాలక్ష్మి నాయుడు, శ్రీనివాస నాయకుడు పాల్గొన్నారు.

ప్రజల సహకారంతోనే అభివృద్ధి

- నగరవాసులకు మౌలిక వసతుల కల్పనే లక్ష్యం
- మేయర్ గొలగాని హరి వెంకటకుమారి
- 65వ వార్డులో అభివృద్ధి పనులకు శంకుస్థాపన



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మేయర్ హరి వెంకటకుమారి, ఎమ్మెల్యే నాగిరెడ్డి

పెదగంట్యాడ: జీవీఎంసీ పరిధిలోని అన్ని వార్డుల్లో ప్రజలకు మౌలిక వసతులు కల్పించేందుకు కృషి చేస్తున్నామని మేయర్ గొలగాని హరి వెంకటకుమారి అన్నారు. ప్రజల సహకారం తోడైతే మరింత అభివృద్ధి సాధ్యపడుతుందన్నారు. జీవీఎంసీ 65వ వార్డు పరిధి భానోజీతోటలో రూ.34 లక్షల 68 వేలతో నిర్మించనున్న కల్వర్ట్ కాలువల, సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డితో కలసి శుక్రవారం ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో విశాఖ నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దడంతో పాటు ఎంతో అభివృద్ధి చేశామన్నారు. జీవీఎంసీ పాలక వర్గం ఏర్పాటు అయినప్పటి నుంచి అన్ని వార్డుల్లో ప్రధాన సమస్యలను దశల వారీగా పరిష్కరించామని చెప్పారు. గాజువాక నియోజకవర్గ పరిధిలో తమ దృష్టికి వచ్చిన సమస్యలను కోట్లాది రూపాయలతో పరిష్కరించామన్నారు. పార్టీలు, కుల, మతాలకు అతీతంగా అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తున్నామని వివరించారు. భవిష్యత్తులో మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ గాజువాక సమన్వయకర్త ఉరుకూటి రామచంద్రరావు (చందు), కార్పొరేటర్ బొడ్డు నరసింహపాత్రుడు, డీఈ అప్పారావు, నాయకులు మద్దాల అప్పారావు, సింగంపల్లి దేముడు, మంగునాయుడు, మంజుల, పెంద్ర రాజు, పులి పెంటయ్య రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యువత సామాజిక సేవపై దృష్టి పెట్టాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న కార్తీక్

గాజువాక : నేటి యువత సామాజిక సేవపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని పల్లా చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ పల్లా కార్తీక్ అన్నారు. ఆదిత్య డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో గాజువాక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన ఎన్ఎస్ఎస్ యూనిట్–3 కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. కాలుష్య నివారణకు మొక్కలు ఎక్కువగా నాటాలని, దీనిపై యువత ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అన్నారు. అనంతరం పాఠశాల ఆవరణలో విద్యార్థులు శుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ప్రోగామ్ ఆఫీసర్ కె.శివలక్ష్మి, కళాశాల ప్రిన్సిపాల్ పి.ప్రదీప్ కుమార్, హైస్కూల్ ప్రధానోపాధ్యాయిని కె.విజయ ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

కల్యాణం.. కమనీయం



యజ్ఞోపవీతధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకుడు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శుక్రవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవ మూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అలంకరించి అధిష్టింపజేశారు. విష్వక్సేనపూజ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం కమనీయంగా నిర్వహించారు. ఉభయదాతలకు కల్యాణ అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

ఏరియా ఆస్పత్రిలో వసతుల కల్పనకు ప్రాధాన్యం

అభివృద్ధి కమిటీ సమావేశంలో తీర్మానం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

అగనంపూడి: అగనంపూడి ఏరియా ఆస్పత్రికి వచ్చే వాహనాల పార్కింగ్ స్థలం అభివృద్ధి చేయడం, శిథిలావస్థలో ఉన్న పంచాయతీ భవన ఆవరణను రోగుల సహాయకులు వేచి ఉండడానికి వీలుగా ఉద్యానవనంగా తీర్చిదిద్దేలా జీవీఎంసీ చొరవ తీసుకునేలా కమిషనర్, మేయర్‌తో మాట్లాడడానికి అభివృద్ధి కమిటీ సమావేశం తీర్మానం చేసింది. అగనంపూడి అభివృద్ధి కమిటీ సమావేశం కమిటీ చైర్మన్, గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి సమక్షంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలో రోగుల అవసరాలకు కోసం వసతులు కల్పించడానికి, పెండింగ్ బిల్లులు చెల్లించడానికి, ఆరోగ్యశ్రీ పథకంలో స్థానికంగా సేవలు అందించిన నేపథ్యంలో డైట్ బిల్లులు చెల్లించడానికి సమావేశం తీర్మానం చేసింది. ఆపరేషన్ థియేటర్‌లో శానిటరీ పైప్‌లైన్ మరమ్మతులు చేపట్టాలని, ఆస్పత్రి మెయిన్ గేటును ఆనుకొని జాతీయ రహదారిపై ఉన్న శిథిల డ్రైనేజీ మరమ్మతులు చేపట్టాలని తీర్మానించారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జె.భారతి, ఆర్ఎంవో డాక్టర్ ఉష, వైద్యులు గోపీకృష్ణ, కమిటీ ప్రతినిధులు నక్కా రమణబాబు, దానబాల అప్పలనాయుడు పాల్గొన్నారు.

కేజీహెచ్‌లో పీడియాట్రిక్ ఇంటెన్సివ్ కేర్ యూనిట్

- 27న ప్రారంభించనున్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి విడదల రజిని
- రూ.80 లక్షల వ్యయంతో పలు సౌకర్యాల ఏర్పాటు



యూనిట్‌లో శరవేగంగా జరుగుతున్న అభివృద్ధి పనులు

మహారాణిపేట : కేజీహెచ్ పిల్లల వార్డులో రూ. 80 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న పీడియాట్రిక్ ఇంటెన్సివ్ కేర్ యూనిట్ (పీఐసీయూ) ఈనెల 27న ప్రారంభం అవుతుంది. వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని ఈ యూనిట్‌ను ప్రారంభిస్తారని సూపరింటెండెంట్ డాక్టర్ పి.అశోక్‌కుమార్ శుక్రవారం మీడియా ప్రతినిధులకు తెలిపారు. మొత్తం 40 పడకలతో ఏర్పాటు చేస్తున్న ఈ యూనిట్‌లో ఒక ఏడాది నుంచి ఏడు సంవత్సరాల లోపు పిల్లల సంపూర్ణ ఆరోగ్యం కోసం చికిత్స అందిస్తామన్నారు. ఆంధ్రా మెడికల్ కాలేజీ నిధులు రూ. 20 లక్షలు, కేజీహెచ్ నిధులు రూ. 20 లక్షలు, కలెక్టర్ మల్లికార్జున అందించే సీఎస్ఆర్ ఫండ్ రూ. 40 లక్షలతో ఈ యూనిట్ నిర్మిస్తున్నామన్నారు. వెంటిలేటర్ వంటి సదుపాయాలు పొందుపరుస్తున్నామని తెలిపారు. అలాగే కేజీహెచ్‌లో 120 సీసీ కెమెరాలు అమర్చుతున్నామన్నారు.

ఏవీఎన్ కళాశాలకు బీఎన్ రెడ్డి విరాళం



విరాళం అందజేస్తున్న ఇంద్రజాలికుడు బీఎన్ రెడ్డి

డాబాగార్డెన్స్: నగరానికి చెందిన ప్రముఖ ఇంద్రజాలికుడు బీఎన్‌రెడ్డి తాను చదివిన ఏవీఎన్ కళాశాలకు రూ.లక్ష విరాళం అందజేశారు. కళాశాలలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో కరస్పాండెంట్ ఏవీ అదీప్ భానోజీరావు, ప్రిన్సిపాల్ ఎం.సింహాద్రినాయుడుకు ఈ మొత్తం చెక్‌ను అందజేశారు. ఈ మొత్తంపై వచ్చే వడ్డీతో కళా రంగంలో ప్రతిభ చూపే కళాశాల విద్యార్థికి ఏటా నగదు పురస్కారం అందజేయనున్నారు. కళాశాల పూర్వ విద్యార్థి బీఎన్ రెడ్డి ఇంద్రజాల విద్యలో అంతర్జాతీయస్థాయి గుర్తింపు పొందడం తమకు ఎంతో గర్వకారణమని భానోజీరావు తెలిపారు. ఈ సందర్భంగా బీఎన్ రెడ్డిని అభినందించారు.

ముస్లింలను ఓటు బ్యాంక్‌గా వాడుకున్న చంద్రబాబు

వైఎస్సార్‌సీపీ విశాఖ జిల్లా మైనారిటీ అధ్యక్షుడు కేవీ బాబా



కొమ్మాది: నాడు చంద్రబాబు నాయుడు ప్రభుత్వంలో ముస్లింలను ఓటు బ్యాంక్‌గా వాడుకున్నారని వైఎస్సార్‌సీపీ విశాఖ జిల్లా మైనారిటీ అధ్యక్షుడు కేవీ బాబా ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ముస్లింల ద్రోహి అని టీడీపీ నేత నజీర్ విమర్శించడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి బటన్ నొక్కి ప్రభుత్వ పథకాలను దళారీ వ్యవస్థలు లేకుండా నేరుగా బ్యాంకు ఖాతాల్లో వేసి, పేదవారికి అండగా ఉన్నారన్నారు. టీడీపీ ప్రభుత్వంలో జన్మభూమి కమిటీలు ఇష్టానుసారం దోచుకునేవని, కానీ నేడు వైఎస్సార్‌సీపీ పాలనలో అవినీతికి, లంచాలకు తావు లేకుండా వలంటీర్ వ్యవస్థ ప్రవేశపెట్టి వైఎస్ జగన్ జన హృదయ నేతగా నిలిచారన్నారు. డీబీటీ, నాన్ డీబీటీ ద్వారా సుమారు రూ. 24 వేల కోట్లు అందజేసిన ఘనత జగన్ మోహన్ రెడ్డిది అన్నారు. నాడు చంద్రబాబు పాలనలో షాదీ తోఫా కింద రూ. 50 వేలు అందిస్తే నేడు సీఎం జగన్ రూ. లక్ష అందిస్తున్నారని, 2022–23 హజ్ యాత్రలకు వెళ్లిన 2977 హాజీలకు రూ. 20కోట్ల 3 లక్షలు ఖర్చు పెట్టిన ఘనత సీఎం జగన్‌దే అన్నారు.

మైనారిటీల పక్షపాతి సీఎం జగన్

ఆక్రమణలకు గురైన 32 వేల ఎకరాల వక్ఫ్ ఆస్తులను తిరిగి స్వాధీనం చేసుకునేందుకు స్వతంత్ర అధికారాలు ఇస్తూ వక్ఫ్ ట్రిబ్యునల్ ఏర్పాటు చేసిన మైనారిటీల పక్షపాతి సీఎం జగన్ అని కొనియాడారు. చంద్రబాబు హయాంలో ఇమామ్‌లకు ఇచ్చే రూ. 5వేలును పదివేలకు, మౌజన్‌లకు ఇచ్చే రూ.3 వేలను రూ.5వేలకు పెంచిన ఘనత సీఎం జగన్‌దే అన్నారు. చంద్రబాబు ముస్లింలను రాజకీయంగా అభివృద్ధి చేయలేదని.. కానీ సీఎం జగన్ ఒక ఉప ముఖ్యమంత్రిని, ఒక శాసన మండలి డిప్యూటీ చైర్‌పర్సన్‌ను, నలుగురు ఎమ్మెల్యేలను, నలుగురు ఎమ్మెల్సీలను, ఇద్దరు మేయర్లను, 11మంది మున్సిపల్ చైర్‌పర్సన్లను ఇచ్చి మైనారిటీలకు రాజకీయంగా గుర్తింపునిచ్చారన్నారు. నాటికి, నేటికి ముస్లింలకు ఏం అభివృద్ధి జరిగిందో తేల్చుకునేందుకు టీడీపీ నాయకులు సిద్ధమా అని ప్రశ్నించారు.

సమస్యల పరిష్కారానికి వినతి

అగనంపూడి: అగనంపూడి నిర్వాసిత కాలనీల్లో విద్యుత్ సమస్యలు పరిష్కరించాలని అగనంపూడికి చెందిన ప్రజా సంఘాల నాయకులు ఆర్ఈసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి శ్యామలను కోరారు. ఈ మేరకు ఆమెను కార్యాలయంలో కలసి, వినతిపత్రం అందజేశారు. అగనంపూడి నిర్వాసిత కాలనీల విద్యుత్ అవసరాలకు అనుగుణంగా సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయాలని బి.శ్రీను, సత్యనారాయణ విజ్ఞప్తి చేశారు.